

కథా కౌముది

"మనో నిశ్చలత" – సీతా సుస్మిత, మద్దిపాడు గ్రామం, ఒంగోలు

"విశ్వావసు" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

"శివకామ సుందరి!!"

కేస్ షీట్ మీద అచ్చతెలుగు పేరు చూసి, కళ్ళు మెరిశాయి ఇండియన్ తెలుగు డాక్టరు వినయ్. పేషెంట్ వైపు చూశాడు,

పచ్చని పసుపు ఛాయతో, వెండి తీగలను తలపిస్తున్న నెరసిన జుట్టు, మెళ్ళో ముత్యాలు, పగడాలు కలబోసిన దండ, చక్కని నేత చీరెతో మన ప్రపంచంతో సంబంధం లేనట్లు పడుకోనున్న ఎనభై మూడేళ్ల పండు ముసలిని చూశాడు. కాలం చేసిన తన బామ్మ గుర్తొచ్చి, ఆమె చేతిని ఆప్యాయంగా తడిమాడు.

ఇంతలో అక్కడి హెడ్ నర్సు రావడంతో, కేస్ షీట్లో మందులు రాసి అక్కడనుంచి ముందుకు కదిలాడు వినయ్.

కాసేపటికి ఆ ఐసీయూ వార్డ్ ముందు పది, పదిహేను మంది పిల్లలుండడం చూసి, ఎవరైనా చిన్నపిల్లలు అడ్మిట్ అయ్యారేమోనని కంగారుగా అటువైపు వెళ్ళాడు.

అక్కడి దృశ్యం చూసి, ఆశ్చర్యపోవడం అతని వంతైంది. పిల్లలందరూ ఒకే స్వరంతో, మృత్యుంజయ మంత్రం చదువుతున్నారు. వారిలో భారతదేశ మూలాలున్న తెలుగు, తమిళ, హిందీ భాషల పిల్లలు, నలుగురైదుగురు అమెరికా వారున్నారు.

"శివగామి బామ్మ!! గెట్ వెల్ సూన్!!" అని చెప్పి చడీచప్పుడూ చేయకుండా బయటకు నడిచారు.

"నర్స్!!ఈ... పిల్లలంతా ఎవరూ??" చుట్టూ చూస్తూ అడిగాడు ఇంగ్లీషులో.

"ఆ పెద్దావిడ ఉన్నారు కదా, తన కోసం వస్తారు రోజు." ఆమె కూడా ఇంగ్లీషులో బదులు చెప్పింది.

"ఓహ్!! ఆల్ రైట్." అనుకుంటూ బయటకి నడిచాడు.

"షివఖామ సందరి!!" ఇంగ్లీష్ డాక్టర్ కేస్ షీట్ చూస్తూ పేరుని సరిగా పలకలేక తప్పుగా పైకి చదివేశాడు..

"ఒరేయ్ తింగరి సన్నాసి!! శివకామ సుందరి నా పేరు.

ఒక్క ఒత్తూ, పొల్లు అయినా ఉందటరా అంత కష్టపడి తప్పు చదవడానికి." అని తిట్టుకుంటూ,

"అవును, నేనెక్కడ ఉన్నాను, వీడు మాట్లాడేది నా భాష కాదే??" బామ్మ మనసుతో మాట్లాడుకోవడం ప్రారంభించింది.

ఇంతలో రోజూ వస్తున్నట్టు ఆరోజు కూడా పిల్లలు వచ్చి మృత్యుంజయ మాత్రం చదివారు.

"అబ్బ!! ఎంత చక్కగా అక్షరం పొల్లు పోకుండా చదువుతున్నారు చిన్నారులు." అని మెచ్చుకుంటూ,

"అవును నా దగ్గరకొచ్చి మృత్యుంజయ మంత్రం చదువుతున్నారేంటి?? అసలు ఇన్ని పిల్లగొంతులు నాకోసం ఎందుకు వచ్చాయి?? అబ్బా గుండెల మీద చేతులకి ఈ వైర్లేమిటి, కొంపదీసి పోయేటట్టున్నానా??" ఇన్ని ప్రశ్నలు తనకి తాను వేసుకుంటుంటే, ఒక సుపరిచితమైన గొంతు వినబడింది.

"చిల్డ్రన్!! మీరేం దిగులు పడకండి, బామ్మ తొందరగానే కోలుకుని ఇంటికొస్తుంది. థాంక్స్ ఫర్ బీయింగ్ విత్ అస్." అంటూ పిల్లలని దగ్గరకు తీసుకున్నాడు చలపతి.

"వీడు నా పెద్దాడు కదూ...అంటే నేనిప్పుడు అమెరికాలో ఉన్నానా??" అని ఒక్కోటొక్కటి గుర్తొస్తుంటే,

"గెట్ వెల్ సూన్ శివగామి బామ్మ!!" అనేసి పిల్లలు అక్కడ్నుంచి కదిలారు.

"శివగామి... ఆ శివగామి నాకు ఈ చిన్నారులు పెట్టిన పేరు.

వీళ్ళు నా కిష్కింధ పిల్లలు కదూ, నా పిల్లలు." అని బామ్మ మనసు తెగ ఆరాటపడిపోయింది..

కానీ మెదడు మాత్రం ఎటువంటి చలనం లేకుండా అలాగే పడుకునుంది.

వినయ్ ఆ పిల్లలని రెండురోజుల తర్వాత కూడా చూశాడు, బామ్మ కోసం తపనపడడం.

ఆరోజు వాళ్ళు హాస్పిటల్ బయటకి వెళ్ళిన తర్వాత, వారిని అటుపక్కగా ఉన్న లాన్లోకి పిలిచాడు.

"పిల్లలూ!! ఈ బామ్మ ఎవరూ?? మీరందరూ ఎందుకు ఈమె కోసం వస్తున్నారు??" అని అడిగాడు.

హాస్పిటల్ బెడ్ మీద నిద్రావస్థలో పడుకునున్న బామ్మ మనసు కూడా తను ఆసుపత్రిలో చేరకముందు జరిగింది తలుచుకుంది.

“గోపాలం!! ఒరేయ్ గోపాలం!! ఇవిగో గణపయ్యకు నందివర్ధనాలు, గరిక, మిగతావారికి మిగతా పూలు, పట్టుకెళ్లు.” కొడుకుని పిలిచింది బామ్మ.

“అబ్బా, వస్తున్నానే అమ్మా!! దేవుళ్ళను శుభ్రం చేస్తున్న.” అంటూ బామ్మ దగ్గరకొచ్చి పూలసజ్జ తీసుకున్నాడు.

“నన్ను లోపల పడేసి, నువ్వు పూజ చేసుకో, నేనీలోపల కూరలు తరుగుతాను.” అంటూ చేతికర్రని పట్టుకుంది.

“అబ్బా, పడేయడమేంటే?? ఎన్నిసార్లు చెప్పాలి, అలా మాట్లాడొద్దని?!” అని కోప్పడ్డాడు గోపాలం.

“గోపాలం! ఇంకెన్నాళ్లో నీకు నా నుంచి, నాకు నా శరీరం నుంచి మోక్షం ఎప్పుడో !!???" అంటూ కళ్ళొత్తుకుంది.

" ఛాల్లే ఊర్కోమ్మా, ఇప్పుడేమైందని అంత బాధ?? నేను సరిగ్గా చూసుకోవడం లేదా నిన్ను. పోనీ అన్నయ్య దగ్గరకు వెళ్తావా, ఎప్పటినుంచో అడుగుతున్నాడు కదా??” అంటూ తల్లివైపు ఓరగా చూశాడు.

ఆమె అయిష్టంగా ముఖం పెట్టి, అంతలోనే సర్దుకుని,

“నువ్వు చెప్పు, వెళ్ళమంటే వెళ్తా, ఉండమంటే ఉంటా!!” అన్నది.

గోపాలం హాయిగా నవ్వేస్తూ,

“ఇంకొన్ని రోజులు నన్ను నీ దగ్గర ఉంచుకోమ్మా!!” అన్నాడు గారంగా ఆమె ఒడిలో తల పెట్టుకుని.

కొడుకు ప్రేమకి బామ్మకి ఆనందభాష్పాలు వస్తే, గోపాలానికి మాత్రం తల్లికి విషయమెలా చెప్పాలో తెలియక మనసు కష్టపడింది.

ఒక నెల తర్వాత గోపాలం అనారోగ్యం బామ్మ ముందు బయటపడింది. తల్లడిల్లిన మనసుతో కొడుకుని పొదివిపట్టుకుని

“ఇన్నాళ్లు నీ క్యాన్సర్ విషయం ఎందుకు దాచావురా నాన్నా, ఎంత ఇబ్బంది పెట్టాను నిన్ను. అరవై, డెబ్బైలకే కన్నవాళ్ళు వృద్ధాశ్రమాలకి వెళ్తుంటే, ఈ కుంటిదాన్ని, గుడ్డిదాన్ని మాత్రం ఇన్నాళ్లు సాకావు.” కంటతడి పెట్టుకుంది.

“అమ్మా!! వయసుతో మసకబారిన కళ్ళు, ఊతానికి కర్ర, వినపడని అరాకోరా మాటలు నీకు వ్యాధులు కావు. నువ్వెంత ఆత్మస్థైర్యం కలదానివో నిరూపిస్తాయి..

కానీ నాకే అంత ధైర్యం చాలట్లేదు. ఈ క్యాన్సర్తో నిన్ను జాగ్రత్తగా చూసుకోగలనా లేదా అని. నా పొరపాటు వల్ల నీకేమైనా జరిగితే నన్ను నేను క్షమించుకోలేను...” అంటూ మాట్లాడడం ఆపాడు గోపాలం.

" గోపాలం!! అన్నయ్యకి ఫోన్ కలుపు, నన్ను తీసుకెళ్ళమని అడుగుతాను. నువ్వు నీ కూతురి దగ్గర ఉంటూ వైద్యం చేయించుకో. నువ్వు తొందరగా కోలుకుని మళ్లీ నన్ను ఇక్కడకి తీసుకుని రా. ఇంకెంత వచ్చే వేసంకాలానికి బాగైపోతావు, ఊరగాయలు ఒకేసారి అప్పుడు పెట్టుకుందాం. ఇప్పుడేం వద్దు." అని గబగబా మాట్లాడేసి ఆయాసపడింది బామ్మ.

తల్లి పుత్రవాత్సల్యానికి, అమాయకత్వానికి ముచ్చటపడ్డాడు గోపాలం.

సప్తసముద్రాల ఆవల కూడా ఇంకో ప్రపంచం ఉందనీ, అది ఇంకా భిన్నంగా ఉంటుందని బామ్మ వినడమే కానీ ఎప్పుడూ చూడలేదు, చూడాలని ఆసక్తి చూపలేదు కూడా. నా కుటుంబం, నా మండువా ఇల్లు, నా ఊరు, నా వాళ్ళు ఇవే ఆమె లోకాలు. పెద్దకొడుకు చలపతి, తన భర్త ఉన్నప్పుడే అమెరికా వెళ్ళిపోయి అక్కడే స్థిరపడ్డాడు. వీళ్ళు అయిష్టంగానే ఉన్నా, ఏమీ చేయలేకపోయారు. ఎన్నోసార్లు అతను రమ్మనడిగినా బామ్మ ససేమీరా అనేసింది.

అటువంటిది ఈసారి మరో ఉపాయం లేక ఇలా సర్దుకోవాల్సి వచ్చింది. అసలు తను బ్రతికుండగా ఇటువంటి పరిస్థితి వస్తుందని బామ్మ కలలో కూడా అనుకోలేదు.

చలపతి దగ్గరకు వచ్చి శివకామసుందరికి అప్పుడే నెల దాటిపోయింది. కోడలు ఒక్క పని కూడా చేయనివ్వదు,

"ఈ వయసులో మీరేం చేస్తారులెండి" అని అన్నీ తనే చేసుకుంటుంది. కూరలు తరుగుదామంటే కత్తిపీట ఉండదు. పూలు కోద్దామంటే,

"అమ్మో పడిపోతే!!" అని ముందే భయపెడతారు.

పోనీ పక్కన కూర్చుని కబుర్లు చెప్తారా అంటే, అసలు నలుగురూ ఒకచోట కూర్చుని కనిపించరు కూడా.

చాలా విసుగ్గా ఉంది బామ్మకి.

ఇలా పరిపరివిధాల ఆలోచిస్తూ ఒకరోజు బాత్రూమ్ బయట పడిపోయింది. ఆ దెబ్బ ఆమెని ఎంత కుదేస్తుందో ఆ క్షణం ఊహించలేదు బామ్మ.

ఆ పడడంతో వెనక తుంటి దగ్గర విరిగి చాలా పెద్ద గాయమే అయింది. మూడు నెలలు ఇంట్లో మంచం మీద ఉంటూ అన్నీ చేయించుకుంది.

ఆ సమయంలో ఆమె పడిన వ్యథ అంతాఇంతా కాదు!!

తగిలిన దెబ్బ శారీరికంగా కోలుకుంది కానీ మానసికంగా చాలా కృంగదీసింది శివకామసుందరిని.

అన్నాళ్ళు మంచం మీద ఉండీ ఉండీ నడవడం మర్చిపోయింది. ఆమెని జాగ్రత్తగా దగ్గరుండి నడిపించేవారు లేక, నడిస్తే పడిపోతారు ఏమోనని భయపెట్టి భయపెట్టి నడక అంటే భయం పట్టుకుంది బామ్మకి.

సరే పోనీ, ఏదైనా వ్యాపకం పెట్టుకుందామనుకుంటే ఎవరూ సహాయానికి రారు.

మనవడి కుటుంబం కూడా ఇక్కడే ఉంటుంది. అయినా ఎవరూ లేనట్టే ఉంటుందా ఇల్లు.

ఒకరోజు మనసులోనే మాట్లాడుకుంటూ,

" గోపాలం!! నువ్వుంటే ఎంత బాగుండురా. నా వేళ్ళకి పట్టు చిక్కట్లేదంటే నువ్వే జడ అల్లేవాడివి, బాలేనప్పుడు నన్ను చక్కగా తయారుచేసేవాడివి. ఇక్కడ నన్ను ఇంకా పేషెంటుని చూసినట్టే చూస్తున్నారు. అసలు నువ్వుంటే ఇన్నాళ్లు నేను మంచం మీద ఉండేదాన్నా?? ఎప్పుడో నాచేత పూలు కోయించేవాడివి. ఇప్పుడు నాకు నీ ఆసరా కావాలిరా, నీ దగ్గరకి వచ్చేస్తాను!!" అని కొడుకుని తలచుకుని పాపం వెక్కివెక్కి ఏడ్చింది.

ఇంతలో తన అంతరాత్మే తనతో మాట్లాడడం ప్రారంభించింది.

"సుందరీ!! ఇంతకంటే ఎన్నో పెద్ద కష్టాలే చూసినదానివి, ఇప్పుడు నీదాకా వచ్చాక ఎందుకు భయం?? నడవలేకపోవచ్చు, నీ చేతలు, మాటలతో నిన్ను నువ్వు కొత్తగా సృష్టించుకో." అని ధైర్యం నూరిపోసింది.

ఏదో ఉపాయం తోచినట్టు బామ్మ కళ్లుతుడుచుకుని మరుసటి సూర్యోదయం కోసం ఆశగా ఎదురుచూసింది.

ఉదయాన్నే లేచి మంచం మీద కూర్చునే తన పనులు చేసుకుని, మనవరాలిని పిలిచి తన జుట్టుని కత్తిరించమని ఆజ్ఞాపించింది.

అద్దంలో బాయ్ కట్ లా ఉన్న తన ముఖం చూసుకుని, క్షణం పాటు బాధపడినా,

"మరేం పర్లేదు, ఇది కూడా నా మంచికే!!" అని తనని తాను సమాధానపరచుకుంది.

తనే వేడినీళ్ళతో ఒళ్లు శుభ్రం చేసుకుని చక్కగా తయారై కూర్చుంది.

కిటికీలో నుంచి నులివెచ్చని సుప్రభాత సూర్యకిరణాలు తన మీద ప్రసరిస్తుంటే, అవే ఆశీర్వచనాలుగా భావించి, ప్రత్యక్ష దేవుడికి మనస్పూర్తిగా నమస్కారం పెట్టుకుని,

బామ్మ తనకొచ్చిన భాగవత శ్లోకాలు పైకి పెద్దగా చదువుతూ, దాని తాత్పర్యము ఎదురుగా ఎవరో ప్రేక్షకుడికి చెప్తున్నట్టు చెప్పింది. ఇంట్లో చలపతి, అతని భార్య, మనవడు, సమస్త కుటుంబం

"ఇదేం చోద్యం!?" అని ముక్కున వేలేసుకున్నారు. సరే ఏదో కాసేపు పాడుకుని వదిలేస్తుందిలే అనుకున్నారు కానీ బామ్మ ఉండేకొద్దీ సంగీత స్వరాలు కూడా ఎవరికో నేర్పిస్తున్నట్టే పాడుకున్నది.

ఇక విసుగొచ్చి,

"అమ్మా!! ఇక్కడ ఇలా పెద్దపెద్దగా అరుస్తూ పాడకూడదు, పక్కవారు మన మీద ఫిర్యాదు చేస్తారు. ఆపేయమ్మా." అని బ్రతిమాలాడు.

ఊహూ!! కుదరదు. ససేమీరా కుదరదు. నాతో కూర్చోండర్రా, మాట్లాడండిరా అని ఎన్నిసార్లు అడిగాను మిమ్మల్ని. అసలు నన్ను పట్టించుకోనేలేదు మీరు. అందుకే నా కాలక్షేపం నేను చూసుకున్నాను. ఇప్పుడు మీరెన్ని చెప్పినా నే వినను." అని చెప్తూ

తను దిద్దుకున్న ఓనమాల దగ్గర నుంచి తను ఔపాసన పట్టిన పద్యాలు, విష్ణు, లలిత సహస్రనామాలు, జానపద గేయాలు, హరికథలు ఇలా ఒకటేమిటి తనకి వచ్చిన ప్రతీది పెదపెద్దగా నాలుగువైపులా వినిపించేలా పాడుకుంటూ, చదువుకుంటూ, నవ్వుకుంటూ

బామ్మ ఇప్పుడు మునుపటి శివకామసుందరిలా కనిపించింది వారందరికీ.

వాళ్ళు కూడా రెండురోజులు చూసి ఇక బామ్మ వినదని అర్థమయ్యి, చుట్టుపక్కల నుంచి ఎటువంటి ఫిర్యాదు లేకపోవడంతో మెల్లకుండిపోయారు.

బామ్మ తనని తాను బోర్ కొట్టకుండా చూసుకోవడం ప్రారంభించి అప్పటికే పదిరోజులు దాటాయి.

ఒకరోజు ,

"ఆజ్ ఫిర్ జీనే కి తమన్నా హే!

ఆజ్ ఫిర్ మర్నే ఇరాదా హే!!" అని పాడుకుంటూ జీవిత సారాంశాన్ని గురించి తెలియచేసింది.

ఇలా తాను నేర్చిన ప్రతిదాన్నీ భాషాభేదం లేకుండా అందరికీ వినిపిస్తూ గుర్తుచేస్తున్న బామ్మని చూడడానికి ఒకరోజు నలుగురైదుగురు పిల్లలొచ్చారు.

"అంకుల్!! మేము ప్యూ డేస్ నుంచి ఒక పెద్ద గొంతు వింటున్నాము, చాలా బాగుంది. అది మీ ఇంట్లో నుంచే అని తెలుసుకున్నాము. కెన్ వుయ్ మీట్ హర్??" అని ఎంతో ముద్దుగా రిక్వెస్ట్ చేశారు ఆ పిల్లలు.

చలపతి వారందరినీ ఆశ్చర్యంగా చూస్తూ బామ్మ గదిలోకి తీసుకెళ్ళాడు.

నేత చీర, నెరసిన జుట్టు, బాబ్డ్ క్రాపుతో, నుదుటిన విభూతి రేఖలతో అంతకుమించి వారందరిని చక్కటి చిరునవ్వుతో ఆహ్వానిస్తున్న బామ్మని చూసి వారందరూ ఆశ్చర్యపోయారు. ఇన్నాళ్లు ఆ గొంతు ఏదో పనిచేసుకుంటూనో , లేక ఎవరికైనా నేర్పిస్తూనో, వంట చేసుకుంటూ వినపడుతోందనుకున్నారు కానీ అది తన ఒంటరితనాన్ని మర్చిపోడానికి ఆమె ఎంచుకున్న మార్గమని బామ్మతో కాసేపటి కబుర్ల ద్వారా వారికి అర్థమైంది.

ఆరోజుటి పరిచయం కొన్నిరోజులకు స్నేహంగా మారింది.

వారందరికీ మంచిని నేర్పే గురువును చేసింది, సరదా కబుర్లు చెప్పుకునే స్నేహితను ఇచ్చింది, పిల్లలకు కథలు చెప్పే బామ్మను అందించింది.

నలుగురితో మొదలైన ఆ స్నేహం పదిమందికి చేరింది.

అలా వారి బంధం రోజురోజుకి బలపడుతూ, రోజూ స్కూల్ అయిపోగానే చలపతి ఇంటికొచ్చి బామ్మనీ వీల్చైర్లో కూర్చోపెట్టి బయటకి తీసుకొచ్చేవారు.

తన ఊరు వదిలి వచ్చిన ఇన్నాళ్ళకి తను బయటకి రావడంతో ఆమె మనసు పులకించిపోయింది.

అక్కడి బయటి ప్రపంచం చూసిన బామ్మ ఆనందానికి హద్దుల్లేవు..

అందరూ కలసి బామ్మ నేర్పించేవన్నీ ఒక ఛానెల్లో పెట్టాలని నిశ్చయించుకుని, " బామ్మాస్ కిష్కింధ" అని పేరుపెట్టుకుని ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్, యూట్యూబ్ వంటి వాటిలో పెడుతూ అందరికీ బామ్మనీ పరిచయం చేశారు, ట్రెండీగా బాగుంటుందని బామ్మ పేరు " శివగామి"గా మార్చారు. అదే ముద్దుపేరుతో వారూ పిలుచుకుంటారు.

బామ్మ లాన్లో వారితో తిరుగుతూ వారికి పంచతంత్ర కథలు చెప్తూ, నీతిని బోధిస్తూ ఒక్కోరోజు అందులోనుంచి ప్రశ్నలు అడిగేది.

వారందరూ అందులో ఉత్సాహంగా పాల్గొంటూ దాన్ని రికార్డు చేసి వారి ఛానెల్లో పెట్టుకుని అందరికీ బామ్మ కథలు వినిపించేవారు.

ఒకరోజు ఆ పిల్లల్లో ఒకమ్మాయి ఏడుస్తూ కుర్చీనుండడం చూసిన బామ్మ,

" ఏమైంది చిన్నారి!?" అనడిగింది.

చాలాసేపటి బుజ్జగింపు తర్వాత ఆ పిల్ల నోరు తెరిచి,

"అమ్మ రాత్రి నన్ను పట్టుకుని చచ్చిపోతానని ఏడ్చింది!" అని వెక్కిళ్లు పెట్టింది.

తన తల్లికి ఏదో సమస్యనుకుంటా అని అర్థం చేసుకున్న బామ్మ వెంటనే పిల్లలతో చెప్పించుకుని వారింటికి వెళ్ళింది.

" చూడమ్మాయ్! ఇంట్లో నీకు ఎన్ని సమస్యలైన ఉండచ్చు కానీ పసిపిల్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలి కదమ్మా. అన్నీ గమనిస్తారు, అర్థం చేసుకుంటారు.

సన్నజాజి మొగ్గగా ఉన్నప్పుడే దానికి పరిమళం, విచ్చుకున్న తర్వాత ఎంతోసేపు నిలవదు. జీవితకాలం కాసేపైనా దాని ఉనికి చాటుతుంది. అటువంటిది ఇన్నేళ్ళున్న మనం ఎంత ధైర్యంగా నిలబడాలి. పిల్లల కోసం నిలబడు, పోరాడు." అని ఊరటనిచ్చింది.

శివకామసుందరిలోని మార్పు సంతోషంగా అనిపించింది చలపతికి.

ఒకరోజు ఉదయాన్నే బామ్మ జపం చేసుకుని,

" ఉగాది వస్తుందిరా గోపాలం, పంచాంగం పట్టుకునిరా!" అని చెప్పింది.

కొన్ని క్షణాలకి అర్థమయ్యి,

"ప్చ!! ఇక్కడ గోపాలం లేదుగా." అనుకుంటూ కళ్ళు తుడుచుకుంది.

ఉగాది రోజున దేశం కానీ దేశంలో అందరూ ఒక్కోచోట చేరి పండగ జరుపుకుంటారని తెలిసి కుటుంబసభ్యులతో కలసి వెళ్ళింది బామ్మ.

అక్కడ అలంకరణలు మన తెలుగుదనాన్ని చాటిచెప్తున్నాయి. చాలా ఉత్సాహంగా అడుగుపెట్టింది బామ్మ.

వచ్చిన అందరికీ ఉగాది పచ్చడి ప్రసాదం ఇచ్చారు.

నోట్లో వేయగానే తక్కువైనా చేదుని గొంతులోనే మింగేసుకుంది. ఒకదాని తర్వాత ఒకరు డ్యాన్సులు, పాటలు, ఏవో ఆటలు ఆఖరికి నేల అదిరిపడేలా డిజెతో పండగ ముగించారు.

ఇంటికి చేరిన వెంటనే చలపతి ఎంతో ఉత్సాహంతో,

" అమ్మా! పండగ ఎలా జరిగింది?" అని అడిగాడు.

" ఏముందిరా సంబడం, పండగెక్కడ జరిగింది. అన్నీ పిచ్చి గెంతులు, పిచ్చ చేష్టలు తప్ప." అంటూ తన నిరాశను వ్యక్తపరిచింది.

"హ్మ్మ!! మా అమ్మకు నచ్చితే అది వింత కానీ నచ్చకపోతే ఏముందిలే!" లోపల అనుకున్నాడు చలపతి.

"వీళ్ళకసలు పండగ ఎలా జరుపుకోవాలో నేర్పాలి!!" గట్టిగా అనుకుంది బామ్మ.

ఉగాది వెంటనే వచ్చే శ్రీరామనవమికి తన కిష్కింధను సిద్ధం చేసింది.

శ్రీరామనవమి పేరుతో మళ్లీ అందరూ ఒకచోట చేరారు.

ఈసారి అందరికంటే ముందు బామ్మ తన పిల్లల చేత హరికథ వినిపించింది.

"భక్తులారా! సీతామహాదేవి స్వయంవరానికి ముల్లోకాలనుంచీ విచ్చేసిన వీరాధివీరులలో అందరినీ ఆకర్షించిన ఒకే ఒక దివ్య సుందరమూర్తి,ఆహా! అతడెవరయ్యా అంటే –

రఘురాముడు రమణీయ వినీల ఘనశ్యాముడు రమణీయ వినీల ఘనశ్యాముడు

వాడు నెలరేడు సరిజోడు మనగాడు" అంటూ బుడతలు ఎంతో ముద్దుగా చిడతలు వాయిస్తూ కథ చెప్తుంటే అందరూ లీనమైపోయారు..

రాములవారి పాటలు పాడుతూ అందరికీ పానకం ఇస్తుంటే, తమ ఊళ్ళో పందిరి కింద జరుపుకున్న రామనవమి మనసులో మెదిలింది అందరికీ. ఆనందభాష్పాలు రాలుస్తూ, చాలారోజుల తర్వాత పండగ జరుపుకున్నాం అని ముచ్చటపడ్డారు.

మేరే దేష్ కి ధర్తీ సోనా ఉగ్లే అంటూ మొదలుపెట్టి సారే జహాసే అచ్ఛా " దాకా మన స్వాతంత్ర సమరయోధులను పరిచయం చేస్తూ కూడా నాటకాలు వేయించి, అందరితో "శభాష్" అనిపించింది. పిల్లలందరిలో దేశభక్తి నాటుకుపోతుంటే ఆమె మనసు గర్వంతో ఉప్పొంగిపోయేది.

అలా బామ్మ వారితో ఆడింది, పాడింది, తిరిగింది సామాజిక మాధ్యమాల్లో కూడా పేరుగాంచింది. అయితే ఈ శివగామి బామ్మకి తను శివకామసుందరి అని గుర్తుండడం లేదు, గోపాలంతో మనసులో మాట్లాడుకోవడం గుర్తులేదు. ఆరోగ్యం సంగతి మర్చిపోయింది, తనకి పూలు కోయడం కూడా గుర్తులేదు. బామ్మ అన్నీ మర్చిపోతూ వస్తుంది అప్పటికే ముదిరిన అల్జీమర్స్.

ప్రతీరోజూ ఉదయాన్నే సూర్యుడికి ప్రణామం చేస్తూ పాడే పాట ఆ రోజు వినపడలేదు.

చలపతి " అమ్మా!! అమ్మా!! " అంటూ కన్నీటితో తల్లిని హాస్పిటల్లో చేర్చాడు.

"ప్రాణం ఉంది అంతే కానీ కోమాలో ఉంది" అన్నారు వైద్యులు.

పిల్లల గొంతులు మూగబోయాయి.

బామ్మ కథ విని వినయ్ కళ్ళు చెమ్మగిల్లాయి.

బామ్మ మనసు ఇంకా డోలాయమానంలో ఉంది. పిల్లల కోసం బ్రతకాలా లేక గోపాలం కోసం ఊపిరి ఆపేసుకుని ఆ ఆయుష్షు కూడా బిడ్డకు ఇవ్వాలా అని!!

ఇంతలో లీలగా గోపాలం గొంతు వినిపించింది, తన చేతిని ఆప్యాయంగా తడుతూ,

"అమ్మా, లేమ్మా!! నేను ఆరోగ్యంగా తిరిగొచ్చేసాను చూడు .ఇదిగో నీకోసం ఈ పిల్లలు ఎంత తాపత్రయపడుతున్నారో, వారికోసం కళ్ళు తెరువమ్మా." అని ప్రాధేయపడుతున్నాడు.

"హమ్మయ్య." అనుకుంటూ రెండురోజులకి కళ్ళు తెరిచింది బామ్మ.

ఎదురుగా గోపాలం కనిపించలేదు, కళ్ళు ఎంత వెతికినా ఊహూ లాభం లేకపోయింది.

బామ్మ మెదడు అనుమానపడింది. మనసు మాత్రం,

"పోనీలే వాడు కూడా పిల్లల కోసం ఇంకా బ్రతకమన్నాడు, అదే వాడి మాట కూడా!!" అని సమాధానపరచింది.

ఎవరికైనా తెలుసో లేదో శివకామసుందరి కోమాలోకి వెళ్ళిన రోజే గోపాలం ప్రాణం భగవంతునిలో కలిసిపోయింది...

Post your comments